సాక్షి చిత్తూరు

బుధవారం । 30 । అక్టోబర్ । 2024



కబడ్డీ పోటీల్లో చిత్తూరు జట్టు సత్తా

రాష్ట్రస్థాయి అండర్–17 కబడ్డీ పోటీల్లో చిత్తూరు బాలికల జట్టు ప్రథమ స్థానం సాధించినట్లు ఆ స్కూలు హెచ్‌ఎం తెలిపారు. - 8లో



బాణసంచా సీజ్

గుడిపాల మండలం బొమ్మసముద్రంలో రూ.3 లక్షల విలువైన బాణసంచా సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. - 8లో

గజ దాడులు

పులిచెర్ల మండలంలోని చల్లావారిపల్లెలో వరి పంటను మంగళవారం తెల్లవారుజామున ఏనుగులు తొక్కి ధ్వంసం చేశాయి.



- 8లో

న్యూస్‌రీల్

భూమనకు పెద్దిరెడ్డి అభినందనలు



భూమన కరుణాకరరెడ్డిని సత్కరిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి మంగళం: చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా భూమన కరుణాకర రెడ్డి నియమితులైన సందర్భంగా మంగళవారం పద్మావతీపురంలోని భూమన నివాసానికి మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వయంగా విచ్చేశారు. ఈ సందర్భంగా భూమన కరుణాకరరెడ్డికి దుశ్శాలువ కప్పి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఇద్దరూ కొంతసేపు ముచ్చటించారు.

డీఆర్వో పుల్లయ్య వైఎస్సార్ కడపకు బదిలీ



పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్ : డీఆర్వోగా విధులు నిర్వహించిన పుల్లయ్యను వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలకు ముందు జిల్లాకు డీఆర్వోగా విచ్చేసిన ఈయన ఎనిమిది నెలల పాటు ఇక్కడ విధులు నిర్వహించారు. తాజాగా ఆయన్ని వైఎస్సార్ కడప జిల్లా తెలుగు గంగ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన మంగళవారం డీఆర్వో విధుల నుంచి రిలీవ్ అయ్యారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

– బాధ్యతలు స్వీకరించిన నూతన డీఆర్వో మోహన్ కుమార్



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నూతన డీఆర్వో మోహన్ కుమార్ అన్నారు. వైజాగ్ నుంచి చిత్తూరుకు బదిలీపై విచ్చేసిన ఆయన మంగళవారం డీఆర్వోగా బాధ్యతలు స్వీకరించారు. మొదట కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో పలు జిల్లాల్లో డీఆర్వోగా విధులు నిర్వహించిన అనుభవం ఉందన్నారు. పరిపాలన పరంగా ఎలాంటి సమస్యలను తలెత్తకుండా ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తూ విధులు నిర్వహిస్తానన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కాణిపాకం దేవస్థానం వేదపండితులు డీఆర్వోకు వేద ఆశీర్వాదం పలికి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, సూపరింటెండెంట్‌లు వాసుదేవన్, మురళి, బ్యూలా తదితరులు నూతన డీఆర్వోను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.





బైరెడ్డిపల్లెలో నిరసన తెలుపుతున్న 108 సిబ్బంది

బాబుగారి జమానా.. యాతన జీవులు

చిత్తూరు నగరానికి చెందిన రామయ్య (పేరు మార్చాం) 108లో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు నెలకు రూ.14 వేలు జీతం వస్తుంది. ఇందులోనే అన్ని అవసరాలు తీర్చుకోవాలి. ఈయనకు నెలవారీ ఇంటి సరుకులకు రూ. 5 వేలు, పాలకు రూ.వెయ్యి, గ్యాస్‌కు రూ. 970, కరెంటు బిల్లు రూ.500 నుంచి రూ.600, ఇద్దరు పిల్లలకు స్కూల్ ఫీజు ఈఎంఐ పద్ధతిలో నెలనెలా రూ. 4వేలు చెల్లించాల్సి ఉంది. ఇది పోను ఇతరాత్ర ఖర్చులు నిత్యం ఏదో రకంగా వెంటాడుతుంటాయి. చివరకు చేతికి చిల్లిగవ్వ మిగలదు. ఇక డ్వాక్రా రుణం, అప్పులకు వడ్డీలు వీరిని పట్టి పీడిస్తుంటాయి. ఇలాంటి తరుణంలో వేతనాలు అందకపోతే కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలో తెలియడం లేదని ఆయన ఆవేదన చెందుతున్నారు.

ఆ చిరుద్యోగుల సేవలు అపూర్వం.. వారు నిరుపేదల పాలిట దైవం.. అయినా వారు పొందే వేతనం అతి స్వల్పం.. అది కూడా నెలల తరబడి అందని వైనం.. రోజురోజుకూ నింగిలోకి నిత్యావసర వస్తువుల ధరలు, వైద్య అవసరాలు, పిల్లల చదువులు..వెరసి.. కాలక్రమంలో పెరుగుతున్న జీవన వ్యయం.. మరో రెండు రోజుల్లో రానున్న దీపావళి సంబరం.. ఏమి చేయాలో తెలియనితనం.. ఫలితం.. ఆ ఒప్పంద, అవుట్‌సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగుల బతుకు భారం.. పండుగ పూట పస్తులేనని నిర్వేదం. ఇదీ జిల్లాలో 104,108 ఉద్యోగుల దుస్థితి.

- 108, 104 ఉద్యోగులకు వేతన కష్టాలు
- రెండు నెలలుగా అందని జీతాలు
- వచ్చే నెల జీతాల చెల్లింపు కూడా ప్రశ్నార్థకం
- కాలం వెళ్లదీస్తున్న ప్రభుత్వం
- ఇబ్బందుల్లో ఉద్యోగులు, సిబ్బంది

కాణిపాకం: జిల్లాలో 104 వాహన సేవలు, 108 అంబులెన్స్‌లు అరబిందో సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. వీటిలో 104 వాహనాలు 44 నడుస్తున్నాయి. ఇందులో డ్రైవర్లు 44 మంది, డీఈఓలు 44 మంది, మేనేజర్ ఒకరు పనిచేస్తున్నారు. అలాగే 108 వాహనాలు 33 నడుస్తున్నాయి. వీటిలో ఈఎంటీ(ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్)లు 80 మంది, పైలెట్లు (డ్రైవర్లు) 80 మంది, ముగ్గురు సూపర్‌వైజర్లు, ఒక జిల్లా మేనేజర్ పనిచేస్తున్నారు. క్షేత్రస్థాయిలో అత్యవసర వైద్య సేవలు అందించడంలో వీరంతా కీలకంగా పనిచేస్తున్నారు. ప్రతి నెలా ఈ వాహనాల ద్వారా కనీసం 55 వేల మంది సేవలు పొందుతున్నారు. 104 వాహనాల ద్వారా 50 వేల మంది రోగులను పరీక్షిస్తుంటారు. ఎక్కడో దూరంగా ఉన్న ప్రభుత్వ వైద్య కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రోగుల వద్దకే వెళ్లి సేవలను అందిస్తున్నారు. ప్రతి నెలా అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనాలను 5 వేల మంది వినియోగించుకున్నట్లు అధికారులు గణాంకాలు చెబుతున్నాయి.

నిధులు రాక..అవస్థలు

ప్రస్తుతం 104 వాహనాలకు అవసరమైన ఇంధనం, మందులను మాత్రం నిర్వహణ సంస్థ అరబిందో ఫౌండేషన్ అందజేస్తోంది. జీతాల గురించి అడిగితే ప్రభుత్వం నుంచి నిధులు ఇంకా విడుదల రాకపోవడం వల్లే ఇవ్వలేకపోతున్నామని చెబుతున్నారంటూ సిబ్బంది వాపోతున్నారు. వాహనాల్లో పనిచేసే డ్రైవర్లకు సీనియారిటీ ఆధారంగా రూ.14వేల నుంచి రూ. 25వేలు మధ్యలో ఉంటోంది. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ. 15 వేల లోపే జీతాలు ఇస్తున్నారు. మేనేజర్లకు రూ. 50 వేల వరకు జీతాలు అందుతున్నాయి. 108లో పనిచేసే ఈఎంటీ, పైలెట్‌లకు రూ. 20 వేల నుంచి రూ.30 వేల వరకు వస్తోంది. సూపర్‌వైజర్లకు రూ.30 వేలు, మేనేజర్‌కు రూ. 50 వేల చొప్పున్న చెల్లించాల్సి ఉంది. అయితే రెండు నెలలు(ఆగస్టు, సెప్టెంబర్)గా జీతాలు అందకపోవడంతో వీరు నానా అవస్థలు పడుతున్నారు. కుటుంబ అవసరాలకు అప్పులు చేసి పప్పు కూడు తింటున్నారు. ప్రభుత్వం జీతాల చెల్లింపు విషయంలో మీనమేషాలు లెక్కిస్తూ సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తోంది. వచ్చే నెల కూడా జీతాల ఇస్తారా? లేదా అన్న అంశం ప్రశ్నార్థకంగానే మిగిలిందని వారు వాపోతున్నారు. దీంతో 104, 108 సిబ్బంది రోడెక్కేందుకు సిద్ధమయ్యారని తెలుస్తోంది.

104లో ఇలా...

104 వాహనాల్లో అన్ని రకాల పరీక్షలు చేసేందుకు పరికరాలున్నాయి. ఈసీజీతో సహా 9 రకాల పరీక్షలు చేస్తారు. మధుమేహం, రక్తపోటు, గుండె, కడుపు, కంటికి సంబంధించిన పరీక్షలు చేస్తుంటారు. అక్కడికక్కడే బాధితులకు 74 రకాల మందులను ఉచితంగా అందిస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ జీవనశైలి మారిపోతున్న నేపథ్యంలో అక్కడ కూడా మధుమేహం, రక్తపోటు లాంటి దీర్ఘకాలిక వ్యాధుల బారినపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. రోజూ ఈ వాహనాల వద్ద వైద్యులు నిర్వహించే ఓపీకి ఈ వ్యాధులతో బాధపడే వాళ్లే అధికంగా వస్తుంటారు. వాస్తవానికి గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారు బీపీ, మధుమేహం లాంటి పరీక్షలను ఎప్పటికప్పుడు ఆస్పత్రులకు వెళ్లి చేయించుకునే పరిస్థితి ఉండదు. దీంతో వ్యాధుల తీవ్రత పెరిగి గుండెపోటు బారినపడుతున్న వారు కూడా పెరుగుతున్నారు. ఇలాంటి కీలకమైన వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాల్లో ఆపేస్తుండడంతో అక్కడ ఉండే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు.

కుయ్..కుయ్‌మంటూ 108..

అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు 108 వాహనం ఆయుష్ పోస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఏ ఘటన జరిగిన వెంటనే 108 వాహనం కుయ్ కుయ్ మంటూ పరుగులు పెడుతోంది. రాత్రి పగలు తేడా లేకుండా రోడ్డు ప్రమాదాలు, ప్రసవ సేవలు, అత్యవసర ఆరోగ్య సేవల సమయంలో ఠక్కున వచ్చి కాపాడుతోంది. ఇలాంటి తరుణంలో 108 సిబ్బంది పనితీరు భేష్ అనే ముద్ర వేసుకుంది. అయితే వారి జీతభత్యాల విషయంలో ప్రభుత్వం ఏ మాత్రం స్పందించకపోవడం శోచనీయమని పలువురు ఆరోపిస్తున్నారు.

త్వరలో అందుతాయి

రెండు నెలల జీతాలు రావాల్సి ఉంది. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సాంకేతి సమస్య కారణంగా జీతాల చెల్లింపు ఆలస్యమైంది. త్వరలో పెండింగ్ జీతాలు జమవుతాయి. చెల్లింపు విషయంలో ఎలాంటి అనుమానాలొద్దు.

– ప్రభావతిదేవి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

ట్రూ అప్ చార్జీలను ప్రభుత్వమే భరించాలి



భూతాల మాస్క్ ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: పెంచిన ట్రూ అప్ చార్జీల ప్రభుత్వమే భరించాలంటూ సీపీఐ నాయకులు భూతాల మాస్కులు ధరించి నిరసన తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో డివిజనల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలు రకాల పన్నుల రూపంలో సామాన్య, మధ్య తరగతి ప్రజలు అవస్థ పడుతున్నారన్నారు. వీటితోపాటు అదనంగా కరెంటు చార్జీల పిడుగు నవంబర్ నుంచి అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఒకపక్క పెరుగుతుండడంతో సామాన్యుడు జీవనధారం కష్టంగా మారిందన్నారు. వినియోగదారులు వాడుతున్న విద్యుత్ యూనిట్లకు డబ్బులు చెల్లిస్తున్నప్పుడు సర్దుబాటు చార్జీల పేరుతో కరెంట్ చార్జీలు చెల్లించమనడం ఎంతవరకు సమంజసమని అన్నారు. టీడీపీ అధికారంలోకి రాకముందు కరెంట్ చార్జీలను పెంచమని, ట్రూ అప్ చార్జీలను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని గాలికొదిలేశారని ఆరోపించారు. ట్రూ అప్ చార్జీలను రద్దు చేయని పక్షంలో ప్రజలను సమీకరించి వామపక్షాల ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మణి ,ఆర్ముగంరెడ్డి, విజయగౌరి, రమాదేవి, కోమల, కవిత, లతారెడ్డి, మునిరత్నంనాయుడు, దామోదరం, ప్రియా, రమేష్‌బాబు, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

- కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా నిత్యం పర్యవేక్షించాలన్నారు. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. ప్రతి 15 రోజులకొకసారి తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసే సన్నివేశాలను జియోట్యాగింగ్, ఫొటో, వీడియోలు రికార్డు చేయాలన్నారు. తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఇంకనూ వ్యక్తిగత మరుగుదొడ్లు లేకపోతే గుర్తించి, నిర్మాణాలకు చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలో ఎవరైనా అలసత్వం వహిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. గ్రామాల్లో పన్నుల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సచివాలయ సిబ్బంది పనితీరును పరిశీలించాలన్నారు. ఎవరైనా విధులకు గైర్హాజరయినట్లు తెలిస్తే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

నవంబర్ మొదటి వారంలో నైపుణ్యగణన

జిల్లా వ్యాప్తంగా నవంబర్ మొదటి వారంలో నైపుణ్య గణన ప్రారంభమవుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు నైపుణ్యగణనపై సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. సర్వేలో 15– 59 మధ్య వయస్సు ఉన్న ప్రజల నుంచి సమగ్ర సమాచారం తీసుకుంటారన్నారు. గ్రామ సచివాలయాలు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇతర శాఖల సిబ్బంది స్కిల్ సెన్సెస్ సర్వేలో పాల్గొనాలని ఆదేశించారు. ఆధార్ ఆధారిత ఓటీపీ, బయోమెట్రిక్ యానిమేటర్ల వివరాలను సేకరిస్తారన్నారు. ఓటీపీని బహిర్గతం చేసే విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకూడదని సూచించారు. సర్వేకు రూపొందించిన ప్రత్యేక యాప్‌లో అభ్యర్థుల వివరాలు నమోదు చేస్తారన్నారు. ఒక్కో అభ్యర్థికి 70 నుంచి 80 ప్రశ్నలు నమోదు చేయాల్సి రావడంతో పది నిమిషాల వరకు సమయం పడుతుందన్నారు. ప్రజలు విద్యార్హత సర్టిఫికెట్లు, ఇతర సమాచారాన్ని ముందస్తుగా సిద్ధం చేసుకుని ఉంటే సర్వే సులువుగా పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, డీపీఓ పార్వతి, జిల్లా ఉపాధి కల్పనా అధికారి పద్మజ, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కుప్పం



కుప్పాన్ని దేశంలో ఆదర్శంగా తీర్చిదిద్ది, అగ్రపథాన నిలుపుతాం.. ఇవీ పాలకులు గొప్పలు.. అయితే గంజాయి సాగు..దిగుమతి.. విచ్చలవిడిగా విక్రయం..అక్రమ రవాణా.. యువత పెడదోవ.. ఇవీ వాస్తవ పరిస్థితులు. వెరసి దిగజారుతున్న కుప్పం ప్రతిష్ట.. పొరుగున ఉన్న కర్ణాటకతోపాటు సుదూరంలోని కేరళలోనూ కుప్పం ప్రాంతవాసులపై గంజాయి రవాణా కేసులు నమోదే ఇందుకు నిదర్శనం.. ఇదీ నేడు కుప్పం దుస్థితి.

- స్థానికంగా విస్తరిస్తున్న సాగు
- రామకుప్పం, శాంతిపురంలో వెలుగులోకి..
- పెడదారి పడుతున్న యువత
- సాగుతో పాటు దిగుమతి
- కర్ణాటక, కేరళల్లోనూ కుప్పం ప్రాంతవాసులపై కేసులు



పోలీసులు సీజ్ చేసిన గంజాయి ప్యాకెట్లు

శాంతిపురం: కుప్పం నియోజకవర్గంలో గంజాయి సాగు వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఓ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు గంజాయి వ్యాపారం, వినియోగం చేస్తున్నారని అధ్యాపకులు ఇచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు నెల రోజుల్లోనే పురోగతిని సాధించారు. రామకుప్పం, శాంతిపురం మండలాల పరిధిలో రెండు ప్రాంతాల్లో సాగులోని గంజాయి పంటను గుర్తించి నాలుగు కేసులు నమోదు చేశారు. 84 కిలోల పచ్చి గంజాయి, మరో 1.20 కిలోల ఎండిన గంజాయిని స్వాధీనం చేసుకుని, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడినవి ఇవే అయినా అటవీ ప్రాంతాలు, జన సంచారం లేని ప్రాంతాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఇంకా ఎంత మేర గంజాయి సాగు ఉందనే ప్రశ్న తలెత్తుతోంది. గంజాయి ఆకులతో పాటు ద్రవ, సిగరెట్లు, చాక్లెట్ల రూపంలోనూ రవాణా, వినియోగం సాగుతోంది. ప్రశాంతతకు మారుపేరైన కుప్పంలో విస్తరిస్తున్న గంజాయి సంస్కృతిపై స్థానికుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. మరో వైపు పొరుగు రాష్ట్రాల నుంచి డ్రగ్స్ కూడా అందుబాటులోకి వచ్చాయనే ప్రచారం సాగుతోంది. కొందరు పెద్దల పిల్లలు డ్రగ్స్‌కు అలవాటు పడినా గుట్టుగా రిహాబిలిటేషన్ సెంటర్లలో చేర్చి, చికిత్స అందించారని అంటున్నారు. ప్రధానంగా యువకుల తల్లిదండ్రులు ప్రస్తుత పరిస్థితుల్లో దురలవాట్ల నుంచి తమ పిల్లలను ఎలా రక్షించుకోవాలనన్న ఆవేదనలో ఉన్నారు. స్వలాభం కోసం కొందరు చేస్తున్న అక్రమ వ్యాపారాలు ఈ తరం యువతపై తీవ్ర దుష్పరిణామాలు చూపుతున్నాయని అంటున్నారు.

దిగుమతుల మాటేమిటి ?

స్థానికంగా గంజాయి సాగుపై పోలీసులు నిఘా, నియంత్రణ పెంచినా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్న సరుకు సంగతి ఏమిటన్నది ప్రశ్నగా మిగిలింది. కర్ణాటక నుంచి పలమనేరు ప్రాంతం మీదుగా కుప్పానికి గంజాయిని తరలి ముఠాను రెండు నెలల క్రితమే కన్నడ పోలీసులు పట్టుకున్నారు. మరో వైపు గంజాయి రవాణా చేస్తూ కడపల్లి పంచాయతీకి చెందిన వ్యక్తి కేరళ పోలీసులకు చిక్కి జైలుపాలయ్యాడు. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి జోరుగానే సాగుతున్న విషయం స్పష్టం అవుతోంది. దీనిపైనా అధికార యంత్రాంగం దృష్టి సారించి, రాజకీయ ఒత్తిళ్లను అధిగమించి గంజాయి సాగు, రవాణా చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాల్సి ఉంది. ఇందుకోసం పటిష్టమైన ఇన్‌ఫార్మర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది.

విచ్చల విడి వినియోగం

యువత, అసంఘటిత రంగాల కార్మికులు లక్ష్యంగా కుప్పం ప్రాంతంలో గంజాయి వ్యాపారం సాగుతోంది. గుడుపల్లి మండలంలోని ఓ ప్రభుత్వ కళాశాలలో కొందరు విద్యార్థుల ప్రవర్తనలో తేడా గుర్తించిన అధ్యాపకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గంజాయి వ్యాపారం గుట్టు బయటకు వచ్చింది. కొందరు విద్యార్థులు వ్యాపారం చేస్తే మరి కొందరు వినియోగదారులుగా మారారు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి సరఫరా చేస్తున్న వారిపై కేసులు పెట్టారు. కానీ గత ఆదివారం రాత్రి కుప్పం పట్టణ సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాల విద్యార్థులు గంజాయి మత్తులో రాత్రి పూట జాతీయ రహదారిపై వీరంగం సృష్టించారు. జన్మదిన వేడుకల్లో భాగంగా విచ్చలవిడిగా గంజాయి సేవించి, రెండు వర్గాలుగా విడిపోయి పరస్పరం రాళ్లు, కర్రలతో దాడులు చేసుకున్నారు. తమ ఆశయాలను, విజ్ఞతను, తల్లిదండ్రుల ఆశలను బుగ్గిలో పోసి మత్తులో తేలారు.


పకడ్బందీగా ఉల్లాస్ కార్యక్రమం



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉల్లాస్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఎంపీడీఓ, సెర్ప్ ఏపీఎంలకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నవంబర్ 2వ తేదీ నుంచి ఉల్లాస్ కార్యక్రమం అమలు చేయనున్నట్టు తెలిపారు. సమాజంలో అందరికీ జీవితకాల అభ్యసన అవగాహన పటిష్టంగా నిర్వహించేందుకు ఉల్లాస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఐదు లక్ష్యాలతో ఉల్లాస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రిటికల్ లైఫ్ స్కిల్ అంశంలో ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులకు, పాఠశాల, అంగన్‌వాడీ సహాయకులు, ఆయాలకు, వాచ్‌మెన్ తదితరుల నిరక్షరాస్యులకు అక్షరాస్యతపై అవగాహన కల్పించాలన్నారు. మూడేళ్ల పాటు ఉల్లాస్ కార్యక్రమం జిల్లాలో అమలవుతుందని తెలిపారు. వయోజన విద్య, విద్యాశాఖ, డీఆర్‌డీఏ శాఖల సమన్వయంతో ఉల్లాస్ కార్యక్రమం అమలు చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో 9,078 నిరక్షరాస్యులున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వారందరిని అక్షరాస్యులుగా మార్చి ఆర్థిక, డిజిటల్, క్రియాత్మక అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చే పట్టాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వయోజన విద్య ఏడీ నాగేశ్వరరెడ్డి, ఏపీడీ రవి, ఏపీఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడాపోటీలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో మంగళవారం సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల జిల్లాస్థాయి క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించినట్లు డీఎస్‌డీఓ బాలాజీ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాస్థాయి ఎంపిక పోటీలకు 70 మంది పాల్గొన్నట్లు చెప్పారు. పాల్గొన్న క్రీడాకారులకు పలు క్రీడా పోటీలు నిర్వహించిన ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు నవంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం ప్రతిభ చాటిన క్రీడాకారులను అభినందించారు.

క్లుప్తంగా

గజ దాడులు

కల్లూరు(పులిచెర్ల): మండలంలోని చల్లావారిపల్లిలో రైతు శివకుమార్ సాగు చేసిన వరి పైరును మంగళవారం తెల్లవారుజామున ఏనుగులు తొక్కి ధ్వంసం చేశాయి. దీంతో రైతు నష్టపోయాడు. పంట చేతికొచ్చే సమయంలో ఇలా ఏనుగులు పంటలను నాశనం చేయడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇక్కడే తిష్ట వేసిన ఏనుగులు ప్రతి రోజు ఎక్కడో ఒక చోట పంటలపై దాడి చేస్తూనే ఉన్నాయి.

రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు


గాయపడిన జగజ్జీవన్‌రెడ్డి

చౌడేపల్లె: బోయకొండ మార్గంలోని కృష్ణాపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. చింతమాకులపల్లె పంచాయతీ బయ్యపల్లెకు చెందిన జగజ్జీవన్‌రెడ్డి బైక్‌లో మదనపల్లె వైపు వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఈఘటన ఎలా జరిగిందో తెలియలేదు. తీవ్ర గాయాలతో అపస్మారస్థితిలో పడి ఉన్న అతన్ని గమనించిన స్థానికులు మదనపల్లెకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యసేవల కోసం తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాంఘిక సంక్షేమ శాఖ డీడీ బదిలీ


రాజ్యలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెను వైఎస్సార్ కడప జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బదిలీ చేశారు. జిల్లాలో డీఎస్‌డబ్ల్యూఓగా విధుల్లో చేరిన ఆమె ఉద్యోగోన్నతి పొంది డీడీగా ఇదే జిల్లాలో ఎనిమిదేళ్ల పాటు విధులు నిర్వహించారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి సాంఘిక సంక్షేమ వసతి గృహాల అభివృద్ధి, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల పరిష్కారానికి ఆమె కృషి చేశారు. కాగా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఎవరినీ నియమించలేదు.

అక్రమ వసూళ్లపై డీఎఫ్‌ఓకు ఫిర్యాదు

పలమనేరు: అటవీశాఖాధికారుల అక్రమ వసూళ్లపై బండమీద జరారిపల్లివాసులు మంగళవారం డీఎఫ్‌ఓకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ తాము గ్రామంలో ఊర పందిని కోసి భాగాలు వేసుకుంటుంటే అది అడవిపంది అని స్థానిక అటవీశాఖ అధికారులు ఆ మాంసంతోపాటు తమ ఫోన్లను సీజ్ చేశారన్నారు. తమను భయాందోళనకు గురిచేశారన్నారు. అనంతరం రూ.4లక్షలు డిమాండ్ చేశారని, భయంతో తాము రూ.1.60 లక్షలను వారికి ఇచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి, తమకు న్యాయం చేయాలని మీడియా ముందు విన్నవించారు. అయితే ఈ విషయంపై స్థానిక ఫారెస్ట్ అధికారులు ఏమాత్రం స్పందించలేదు.

ఓటరు ముసాయిదా జాబితా ప్రచురణ

- జిల్లాలో 15,66,502 మంది ఓటర్లు
- 29 నుంచి నవంబర్ 28 వరకు అభ్యంతరాల స్వీకరణ
- నవంబర్ 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు క్యాంపెయిన్
- విలేకరుల సమావేశంలో డీఆర్వో పుల్లయ్య వెల్లడి


ఓటర్ల జాబితా చూపుతున్న జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో ఓటరు ముసాయిదా జాబితాను ప్రచురించినట్లు డీఆర్వో పుల్లయ్య తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితా ఏఆర్వో, పోలింగ్ కేంద్రాలు, బీఎల్వోలు అందుబాటులో ఉంటాయన్నారు. అక్టోబర్ 29వ తేదీ నుంచి నవంబర్ 28వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. నవంబర్ 9, 10, 23, 24 తేదీల్లో ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణకు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తారని చెప్పారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఓటరు నమోదుకు జిల్లాలోని కళాశాలలు, గ్రామాలు, నగరాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. డిసెంబర్ 12 వ తేదీలోపు క్లెయిమ్‌లను, అభ్యంతరాలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. 2025 జనవరి 6వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,269 లోకేషన్లలో 1,776 పోలింగ్ కేంద్రాలున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు బాలసుబ్రహ్మణ్యం, భాస్కర్, అట్లూరి శ్రీనివాసులు, సురేంద్రకుమార్, గంగరాజు, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 15,66,502 మంది ఓటర్లు

జిల్లాలో ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం 15,66,502 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 7,71,264, మహిళలు 7,95,165, ఇతరులు 73 మంది ఉన్నారు. పుంగ నూరులో 2,39,017, నగరిలో 2,02,494, గంగాధరనెల్లూరులో 2,05,380, చిత్తూరులో 2,03,151, పూతలపట్టులో 2,21,443, పలమనేరులో 2,68,536, కుప్పంలో 2,26,481 మంది ఓటర్లున్నారు. జిల్లాలో అత్యధికంగా పలమనేరు నియోజకవర్గంలో, అత్యల్పంగా నగరి నియోజకవర్గంలో ఓటర్లున్నట్లు ముసాయిదా ఓటర్ల జాబితాలో వెల్లడించారు.

ఎవరు చెప్పినా సరే కప్పం కట్టాల్సిందే

- నీవా నది పరివాహక ప్రాంతంలో కూటమి నాయకుల దౌర్జన్యం


కూటమి నేతలు ధ్వంసం చేసిన దారి


ఆగి ఉన్న ఇసుక ట్రాక్టర్

గంగాధర నెల్లూరు: నీవా నది పరివాహక ప్రాంతంలో కూటమి నాయకుల దౌర్జన్యం రోజు రోజుకు పెరిగిపోతుంది. ఎవరు చెప్పినా సరే తమకు కప్పం కట్టాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారు. గంగాధరనెల్లూరు మండలం కొట్రకోన పంచాయతీ పరిధిలోని నీవానది పరివాహక ప్రాంతంలో ఇసుక తీసుకోవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌కు దారిని దౌర్జన్యంగా మూసివేసి, గ్రామాలకు రాకపోకలకు ఏర్పాటుగా చేసుకున్న సిమెంటు పైపులను సైతం రాత్రికి రాత్రి ధ్వంసం చేశారు. ఆ దారిలో ఒక పెద్ద గుంత తవ్వి ఎవరూ వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. కొట్రకోన నీవానది పరివాహక ప్రాంతంలో ఇసుక తీసుకువెళ్లాలంటే తమకు చెందిన ఒకే ఒక మార్గం ఏర్పాటు చేసి, తమ మార్గం మీదుగా వెళ్లాలంటే కచ్చితంగా రూ.250 చెల్లించాల్సిందేనని హుకుం జారీ చేశారు. ఆ మార్గంలో ఒక వ్యక్తిని ఏర్పాటు చేసి ఆ దారిలో రాకపోకలు సాగిస్తున్న ట్రాక్టర్ల నుంచి దౌర్జన్యంగా రూ. 250 వసూలు చేస్తున్నారని ప్రజలు వాపోయారు. దీనిపై మండల స్థాయి అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

రూ.3 లక్షల విలువైన బాణసంచా సీజ్

గుడిపాల: రూ.3 లక్షల విలువైన బాణసంచా సీజ్ చేసినట్లు గుడిపాల ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. బొమ్మసముద్రం ప్రాంతానికి చెందిన దిలీప్ అనే వ్యక్తి ఎటువంటి లైసెన్స్ లేకుండా టపాకాయలు విక్రయించేందుకు సిద్ధం చేస్తుండగా తమకు అందిన సమాచారంతో తనిఖీలు చేశామన్నారు. అతడి ఇంటి వద్ద టపాకాయల గిఫ్ట్ బాక్స్‌లు 60, మరికొన్ని టపాసులు ఉండగా వాటిని సీజ్ చేశామన్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

స్కూల్ వ్యాన్ ఢీ కొని వృద్ధురాలు దుర్మరణం


నాగమ్మ మృతదేహం

బంగారుపాళెం : మండలంలోని గుండ్లకట్టమంచి గ్రామంలో మంగళవారం స్కూల్ వ్యాన్ ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. గుండ్లకట్టమంచి గ్రామానికి చెందిన లేట్ మునస్వామి భార్య నాగమ్మ(78) పాలు తీసుకునేందుకు సెంటర్ వద్దకు వచ్చింది. ఆ సమయంలో ఓ స్కూల్ వ్యాన్ పిల్లలను తీసుకువెళ్లేందుకు వచ్చింది. ఈ క్రమంలో డ్రైవర్ వ్యాన్‌ను మలుపు వద్ద తిప్పుతుండగా వృద్ధురాలు వాహనం వెనుక వైపు రావడంతో ప్రమాదవశాత్తు ఢీ కొంది. ఈ ప్రమాదంలో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సు రద్దు


వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ పురుషోత్తం

చిత్తూరు అర్బన్: మద్యం దుకాణాల్లో మద్యాన్ని గరిష్ట చిల్లర ధర (ఎమ్మార్పీ)కన్నా ఎక్కువ ధరలకు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ అధికారులు హెచ్చరించారు. మంగళవారం చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్ ఎక్సైజ్ సీఐలు శ్రీహరిరెడ్డి, పురుషోత్తం వారి పరిధిలోని మద్యం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ఎమ్మార్పీ ఉల్లంఘించినట్లు తెలిస్తే తొలిసారి రూ.5 లక్షల జరిమానా, రెండోసారి ఇదేపనిచేస్తే లైసెన్సు రద్దు చేస్తామన్నారు. అలాగే బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా చేసినా, ఇదే నిబంధనలు వర్తిస్తాయన్నారు. వ్యాపారులు సహకరించి, నిబంధనల మేరకు విక్రయించాలన్నారు.

మూడు మండలాల్లో తీవ్ర కరువు

- ఉత్తర్వుల్లో పేర్కొన్న ప్రభుత్వం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మూడు మండలాల్లో తీవ్ర కరువు ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వుల్లో రాష్ట్ర వ్యాప్తంగా కరువు మండలాల జాబితాను విడుదల చేసింది. చిత్తూరు జిల్లాలోని 16 మండలాల్లో కరువు ఉన్నట్లు పేర్కొన్నారు. అందులో మూడు మండలాల్లో తీవ్ర కరువు ఉన్నట్లు తెలిపారు. జిల్లాలోని గంగాధరనెల్లూరు నియోజకవర్గం పెనుమూరు, పూతలపట్టు నియోజకవర్గం యాదమరి, చిత్తూరు నియోజకవర్గం గుడిపాలలో తీవ్ర కరువు ఉన్నట్లు సూచించారు. మిగిలిన 13 మండలాలు ఎస్‌ఆర్ పురం, చిత్తూరు, శాంతిపురం, రొంపిచెర్ల, పూతలపట్టు, సోమల, పుంగనూరు, పలమనేరు, బైరెడ్డిపల్లి, వి.కోట, గుడుపల్లి, కుప్పం, రామకుప్పం మండలాల్లో మధ్యస్థ (మోడరేట్) కరువు ఉన్నట్లు వెల్లడించారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఐరాల విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం కోమల, పీడీ దేవా

ఐరాల: జాతీయస్థాయి సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం కోమల తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ అనంతపురం ఎస్‌కే డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో సెప్టెంబర్ 15వ తేదీన జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థి ప్రకాష్ బాలుర జట్టుకు, అలాగే విద్యార్థిని భవిత బాలికల జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. వీరిద్దరూ జమ్ములో నవంబర్ 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్స్ సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. క్రీడాకారులను, పీడీ దేవాను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్, కార్యదర్శి రమేష్, ఎస్‌ఎంసీ చైర్మన్ మహబూబ్‌బాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

బాణసంచా విక్రయంలో నిబంధనలు తప్పనిసరి

చిత్తూరు అర్బన్: దీపావళి పండుగను పురస్కరించుకుని బాణసంచా వ్యాపారులు నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ విక్రయించాలని.. ఎక్కడైనా నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని చిత్తూరు ఎస్పీ మణికంఠ హెచ్చరించారు. బాణాసంచా లాంటి పేలుడు పదార్థాలు ఇంట్లో నిల్వ చేయడానికి వీల్లేదని, గ్రీన్స్ కాకర్స్ పేరిట నిషేధిత పటాకులు అమ్మడం, అనుమతుల్లేకుండా దుకాణాలు ఏర్పాటు చేయడం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక ఎక్కడైనా అనుమతులు లేకుండా బాణాసంచా గోదాములు ఉంటే, ఆ సమాచారాన్ని పోలీసులకు డయల్-112, వాట్సప్-9440900005 నంబర్లకు సమాచారమందిస్తే నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామన్నారు. జిల్లాలో టపాకాయలు విక్రయించే ప్రతి దుకాణంలో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రజలు సంతోషాల మధ్య దీపావళి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

బతుకుదెరువు కోసం వచ్చి...

- లారీ ఢీకొని ఒకరి మృతి


మృతుడు షేక్‌అనీస్(ఫైల్)

పుత్తూరు: బతుకుదెరువు కోసం నవారా పట్టీలు అమ్ముకోవడానికి వచ్చిన ఓ వ్యక్తి లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోయిన ఘటన మంగళవారం పుత్తూరు మండలం తడుకు గ్రామం వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఓబులేసు కథనం మేరకు.. పల్నాడు జిల్లా, పెదకూరపాడు మండలం, పాదపాడు గ్రామానికి చెందిన షేక్‌అనీస్(62) మంచాలకు నవారా పట్టీల వ్యాపారం చేసుకుటూ జీవించేవాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొంత కాలంగా రేణిగుంట వద్ద ఓ గదిని అద్దెకు తీసుకొని చుట్టు పక్కల ఊర్లకు వెళ్లి వ్యాపారం చేసుకుని రాత్రికి అక్కడి చేరుకునేవాడు. మంగళవారం ఉదయం రూమ్ నుంచి నవారా పట్టీలను టీవీఎస్-50 మోటర్ సైకిల్‌పై పెట్టుకుని పుత్తూరుకు బయలుదేరాడు. ఉదయం 6 గంటల ప్రాంతంలో పుత్తూరుకు సమీపంలోని తడుకు గ్రామం వద్ద వస్తుండగా తిరుపతి నుంచి పుత్తూరు వైపు వస్తున్న హెచ్‌ఆర్66 బీ9834 నంబర్ లారీ వెనక నుంచి ఢీ కొనడంతో షేక్‌అనీస్ అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ నిద్ర మత్తులో నేరుగా ఢీకొని, సుమారు 50 అడుగుల దూరం వరకు అతడిని మోపెడ్ సహా లాక్కెళ్లి ఆపాడు. దీంతో మృతుడి శరీరం చిందరవందరైంది. పోలీసులు మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, బంధువులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వేధింపుల కేసులో ఒకరికి జైలు

చిత్తూరు అర్బన్: ఓ వివాహితను వేధింపులకు గురిచేసినందుకు జానకిరామ్ అనే వ్యక్తికి చిత్తూరులోని మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వాతి కథనం మేరకు.. గంగాధరనెల్లూరు మండలం వేల్కూరు గ్రామానికి చెందిన జానకిరామ్‌కు మూడేళ్ల క్రితం ఓ యువతితో స్నేహంగా ఉన్నాడు. కొద్దిరోజుల తరువాత ఆ యువతి పెళ్లి చేసుకుని వెళ్లిపోయింది. అయితే ఆ యువతి తనకు దక్కలేదని కక్ష పెంచుకున్న నిందితుడు, ఆమెపై తప్పుడు పుకార్లు సృష్టించి కరపత్రాలు ముద్రించి, యువతి కాపురముంటున్న ఊరిలో ఇళ్ల ముందు వేశాడు. దీనికితోడు పెళ్లయినా కూడా ఆమెను వేధింపులకు గురిచేశాడు. దీనిపై బాధిత వివాహిత 2022 జూలై 22న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, ఎస్‌ఆర్ పేట పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడ్ని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువుకావడంతో జానకిరామ్‌కు రెండేళ్ల జైలుశిక్ష, రూ.2500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి మాధవి తీర్పునిచ్చారు.

ఎలక్ట్రానిక్ మెడికల్ సిస్టమ్‌ను ఉపయోగించాలి


డాక్టర్ క్రిస్‌బెయిన్‌కు స్వాగతం పలుకుతున్న అపోలో నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ లోకేశ్వరి

తవణంపల్లె: మెడికల్ విద్యార్థులు భవిష్యత్తులో ఎలక్ట్రానిక్ మెడికల్ సిస్టమ్‌ను వినియోగించాలని ఆస్ట్రేలియా మోనాష్ యూనివర్సిటీ ప్రొఫసర్ డాక్టర్ క్రిస్‌బెయిన్ తెలిపారు. మంగళవారం మండలంలోని అరగొండ అపోలో నర్సింగ్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రోగికి మందులు వాడే విధానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ మెడికల్ సిస్టమ్‌తో రోగులకు వైద్యం అందించడంలోనూ, మందులు ఇవ్వడంలో వచ్చే లోపాలను నివారించడానికి, రోగి సమాచారాన్ని భద్రపరచడానికి సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.లోకేశ్వరి, వైస్ ప్రిన్సిపల్ వీఆర్ మాలతి, హెచ్‌ఓడీ డాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

విచారణ కొనసాగింపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం కూడా తిరుపతి డీఎంఅండ్‌హెచ్ శ్రీహరిపై విచారణ కొనసాగింది. గుంటూరు డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయలక్ష్మి విచారణ ప్రక్రియను కొనసాగించారు. రెండో రోజు ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులను ఈ విచారణకు పిలుపునిచ్చారు. అయితే వారు ఎవరూ విచారణకు హాజరు కాలేదు. గతంలో పనిచేసిన కొంత మంది సిబ్బంది మాత్రం హాజరయ్యారు. కాగా బుధవారం కూడా ఈప్రక్రియ కొనసాగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఏపీఐఐసీ భూములపై నిర్ణయం ప్రభుత్వానిదే


ప్రజాభిప్రాయాలు సేకరిస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

నగరి : మండలంలోని వీకేఆర్‌పురంలో ఏపీఐఐసీకి కేటాయించిన భూములకు సంబంధించి ఏ నిర్ణయం తీసుకోవాలన్నా ప్రభుత్వమే తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి తెలిపారు. ఈ గ్రామంలోని కొండల్లో క్రషర్లు ఏర్పాటు చేయడానికి 2018లో దరఖాస్తు చేసుకున్న వారు అనుమతుల కోసం జిల్లా కలెక్టర్‌ను సంప్రదించగా ప్రజాభిప్రాయ సేకరణ, పర్యావరణ కాలుష్య పరిశీలన నిమిత్తం క్రషర్లకు దరఖాస్తు చేసి ప్రాంతంలోనే గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో గ్రామ పెద్దలు కొందరు గ్రామంలో క్రషర్లకు అనుమతిస్తే పంచాయతీ రెవెన్యూ పెరుగుతుందని, గ్రామం అభివృద్ధి చెందుతుందని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా, కొందరు గ్రామంలో కాలుష్యం పెరుగుతుందని సూచించారు. ఏపీఐఐసీకి చెందిన అధికారులు మాట్లాడుతూ క్రషర్లకు దరఖాస్తు చేసుకున్న స్థలం ఎప్పుడో ఏపీఐఐసీ వారికి కేటాయించేశారన్నారు. ఈ ప్రాంతంలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పా టు నిమిత్తం కొన్ని కంపెనీలు ముందుకు వస్తు న్నాయని రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వారు వెనకడుగు వేస్తున్నారన్నారు. రోడ్డు ఏర్పాటులో గ్రామస్తులు సహకరించడం లేదని, రోడ్డు ఏర్పాటు చేయిస్తే మిగిలిన పనులు తాము చేపడతామన్నా రు. దీనిపై జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఏపీఐఐసీకి కేటాయించిన భూములపై వారికే పూర్తి హక్కు ఉంటుందని, దానిపై తాము సొంత నిర్ణయాలు తీసుకోలేమన్నారు. ప్రజల అభిప్రాయాల ను, ఏపీఐఐసీ వారి వివరణను రికార్డు చేశామని, దీన్ని సీఎస్‌కు పంపుతామని వారు ఇచ్చే ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటరెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఎన్విరాన్‌మెంట్, మైన్స్, ఏపీఐఐసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారులకు ఎంపీ ఆర్థిక సాయం


చెక్కు అందజేస్తున్న ఎంపీ ప్రసాదరావు

చిత్తూరు అర్బన్: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల కాణిపాకంలోని అగరంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు జరిగాయి. ఆ పోటీల్లో పాల్గొన్న ఎంపీ.. విజేతలకు తన నిర్మాణరంగ సంస్థ రాధే ద్వారా ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. మంగళవారం చిత్తూరులోని తన కార్యాలయంలో డీఎస్‌డీఓ బాలాజీకి ఈ మొత్తాన్ని అందజేసి, క్రీడాకారులకు అందజేయాలన్నారు. అన్ని విభాగాల్లో విజేతలు, రన్నరప్‌లకు ఈ మొత్తం అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోచ్ రాజేష్, టీడీపీ నేతలు శీన, మహేష్ దితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో చిత్తూరు జట్టు సత్తా

చౌడేపల్లె : అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈనెల 27వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 ఎస్‌జీఎఫ్ పోటీల్లో కబడ్డీ విభాగంలో చిత్తూరు బాలికల జట్టు ప్రథమ స్థానం సాధించినట్లు ఆ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగరాజరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ చౌడేపల్లె మండలంలో జిల్లా జట్టును ఎంపిక చేసి, పట్టుదలతో వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేష్, రాజేంద్ర, ఆధ్వర్యంలో విశ్రాంత పీడీ రామచంద్ర పర్యవేక్షణలో శిక్షణ ఇచ్చామన్నారు. దీంతో రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు తగిన గుర్తింపు దక్కిందన్నారు. అలాగే బాలుర జట్టు నాలుగో స్థానం సాధించినట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఉపాధ్యాయులు, శిక్షకులు అభినందించారు.

సారా స్థావరాలపై దాడులు


సారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

విజయపురం : మండలంలోని కేవీపురం దళితవాడలో సారా స్థావరాలపై స్థానిక పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా తయారీకి సిద్ధంగా ఉన్న 600 లీటర్ల ఊటను ఎస్‌ఐ బలరాం ఆధ్వర్యంలో సిబ్బంది ధ్వంసం చేశారు. ఆయా ప్రాంతాల్లో 45 బస్తాల నల్ల బెల్లం, 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సారా తయారు చేసినా, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఏఎస్‌ఐ గోవిందరాజు, హెచ్‌కానిస్టేబుల్ జనార్దన్, కానిస్టేబుల్ నరేష్, దాము, హోంకార్డు రామచంద్ర పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి


మమత మృతదేహం

బంగారుపాళెం: ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఏఎస్‌ఐ రామచంద్రారెడ్డి తెలిపారు. తుంబకుప్పానికి చెందిన ధర్మేంద్ర, యాదమరి మండలం ఆరిమాకులపల్లెకు చెందిన రఘు భార్య మమత ఈ నెల 26వ తేదీ ద్విచక్ర వాహనంపై బంగారుపాళెం నుంచి నలగాంపల్లెకు వెళుతుండగా మార్గం మధ్యలో భారత్ పెట్రోల్ బంక్ వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మమత(33) తలకు బలమైన గాయం కావడంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.